సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 14 । మార్చి । 2025



రంజాన్ నియమాలు.. ముక్తికి మార్గాలు

రంజాన్ మాసం ఆరంభమైంది. ఈ మాసంలో కొన్ని రోజులైనా ఉపవాసాలు ఉంటూ అల్లాహ్ స్మరణలో ఉండాలని ముస్లీం మత పెద్దలు చెబుతున్నారు.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర॥ (సా॥)	సహర్ శని॥ (ఉ॥)
రాయచోటి	6.29	5.07
రాజంపేట	6.28	5.11
పీలేరు	6.29	5.01
మదనపల్లె	6.31	5.05

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 108 మెట్రిక్ టన్నులు



రేషన్.. పరేషాన్

జిల్లాలో పేదలకు కందిపప్పు అందడం లేదు. రేషన్ ద్వారా పంపిణీ కాక ఇబ్బంది పడుతున్నారు. అసలు రేషన్ సరఫరాయే అస్తవ్యస్తంగా మారింది. కేవలం బియ్యం పంపిణీతో సరిపెడుతున్నారు. దీనిపై లబ్ధిదారులు నిత్యం పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు.

- జిల్లాలో కార్డుదారులకు కనిపించని కందిబేడలు
- అంతంత మాత్రంగానే చక్కెర పంపిణీ
- కూటమి సర్కార్ వచ్చిన తర్వాత రేషన్ సరుకుల్లో కోత
- రోజురోజుకు నిర్వీర్యమవుతున్న ఎండీయూ వాహనాల పరిస్థితి



సాక్షి రాయచోటి: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకులకు కోత పడుతోంది. ప్రభుత్వం కుదిస్తుందో లేక కార్డుదారులకు నిత్యావసరాలు అవసరం లేదనుకున్నారో ఏమో తెలియదుగానీ నిత్యావసర సరుకుల విషయంలో మాత్రం వాత తప్పడం లేదు. వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో ఎప్పుడూ సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు సంబంధించి నాణ్యమైన సరుకులతోపాటు చక్కెర, కందిబేడలు, బియ్యం, జొన్నలు, రాగులు అందించే పరిస్థితి కనిపించేది. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత కందిబేడలకు ధర పెరగడంతోపాటు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సబ్సిడీపై అందించకుండా కోత పెడుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లాలో సుమారు 5,04,325 కార్డుదారులు ఉన్నారు. జిల్లాలో దాదాపు రెండు నెలలుగా కందిబేడలు కనిపించడం లేదు. అధికమొత్తంలో ధర ఒకవైపు పలుకుతుండగా, ఇలాంటి తరుణంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సబ్సిడీపై అందించాల్సి ఉంది. అయితే మార్చితోపాటు ఫిబ్రవరి నెలలోనూ అందించలేదని చెబుతున్నారు. ఒకనెలకు సంబంధించి కందిబేడలు జిల్లాకు 495 మెట్రిక్ టన్నులకు పైగా అవసరం ఉంటుంది. సరుకు రవాణా కాకకపోవడంతో వీటికి ప్రభుత్వం ఎసరు పెట్టింది.జిల్లాలోని కార్డుదారులకు కందిబేడలను పూర్తిగా నిలిపివేయగా, అంగన్వాడీ కేంద్రాలకు మాత్రం అందించారు.

బియ్యంతోనే సరి!



జిల్లాలోని కార్డుదారులకు బియ్యంతోనే సరిపుచ్చుతున్నారు. చక్కెర అంతంతమాత్రంగానే సరఫరా కాగా, కందిబేడలు అసలే రాలేదు. దీంతో ఎన్డీఏ సర్కార్ కేవలం బియ్యంతోనే సరిపెడుతోంది. ఇటీవల మహాశివరాత్రి ముగియగా, రానున్న రంజాన్, ఉగాది పండుగల సందర్భంగా కూడా చక్కెర, కందిబేడలు అందించకపోవడంపై కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు జిల్లాలో 350 వరకు ఎండీయూ వాహనాలు ఉండాల్సి ఉండగా, రానురాను పలువురు తప్పుకోవడం, మరికొన్ని వాహనాలు మరమ్మతులకు గురికావడంతో వీటి సంఖ్య చాలా వరకు తగ్గిపోయింది. ఒకవైపు సరుకుల కోత, మరోవైపు సక్రమంగా ఇళ్లకు సరఫరా కాక వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొందరికే చక్కెర



జిల్లాలో చక్కెర కొంతమంది కార్డుదారులకు మాత్రమే అందింది. సబ్సిడీపై అందించే చక్కెరకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. జిల్లాకు సంబంధించి చక్కెర 250 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా, కేవలం 108 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయింది. అది కూడా ఏడు ఎంఎల్ఎస్ పాయింట్లలో మత్రమే సరఫరా చేశారు. సకాలంలో రావడంతో కొంతమేర కార్డులకు సరఫరా అయింది.

కందిబేడలు ఇవ్వలేదు



ఈసారి రేషన్ సరుకులకు సంబంధించి కందిబేడలు ఇవ్వలేదు. కేవలం బియ్యంతోనే సరిపెట్టారు. చక్కెర కూడా పూర్తి స్థాయిలో రాలేదు. ఎప్పుడూ లేని విధంగా నిత్యావసర సరుకులు నెలనెల అందకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. రానున్న కాలంలోనైనా సరుకులను సక్రమంగా అందించాలని కోరుకుంటున్నాం.

– లక్ష్మిదేవి, పీలేరు

రేషన్ తెచ్చుకోవడానికి అవస్థలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతినెల రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు ఇంటింటికి చేరవేస్తుండగా, 8 నెలలుగా రేషన్ సరుకులు చౌక దుకాణాల వద్ద ఇస్తుండడంతో చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. నిమ్మనపల్లె మండలంలోని దిగువ పల్లె మా గ్రామం. రేషన్ సరుకుల కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముస్టూరుకు వెళ్లాళి. చౌక దుకాణానికి వెళ్లిన రోజు కూలి పనులకు వెళ్లలేక నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్ సరుకులు అందించాలి.

– చందు, దిగువపల్లె గ్రామం, ముస్టూరు పంచాయతీ, నిమ్మనపల్లె మండలం

స్టాకు రాలేదు

అన్నమయ్య జిల్లాకు సంబంధించి కందిబేడలు స్టాక్ రాలేదు. చక్కెర మాత్రం వచ్చిన స్టాకు మొత్తం కార్డుదారులకు చాలా వరకు పంపిణీ చేశాం. వినియోగదారులకు సమస్య రాకుండా చూసుకుంటున్నాం. చక్కెర కూడా పై నుంచి వస్తోంది. రాగానే ఎక్కడికక్కడ కార్డుదారులకు పంపిణీ చేస్తాం.

– రఘురామ్, పౌరసరఫరాల అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

న్యూస్‌రీల్

21న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 21వ తేది జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య నిర్వాహణాధికారి ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఇరు జిల్లాల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

17న చలో విజయవాడ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు

మదనపల్లె సిటీ: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17వతేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం జరగనుంది. దీనిని జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య కోరారు. గురువారం మదనపల్లె డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు వేతనాలు పెంచాలని, కోర్టు తీర్పు ప్రకారం జిల్లాలోని అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని చోట్ల జరుగుతున్న అక్రమాలను అరికట్టాలన్నారు. అనంతరం డీఎల్‌పీఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్,రవి, శీను, రాజు, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్లు పూర్తి చేయండి

కడప రూరల్: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు సంబంధించి వెబ్ ఆప్షన్‌లను పూర్తి చేయాలని వైఎస్సార్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. ఇందుకు సంబంధించి జ్ఞానభూమి వెబ్ ఆప్షన్ సర్వీస్ ప్రారంభమైందన్నారు. ఇప్పటికే 1000 మంది షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులుతమ వెబ్ ఆప్షన్‌లను పూర్తి చేశారని తెలిపారు. షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులందరూ సకాలంలో వారి వెబ్ ఆప్షన్‌లను పూర్తి చేయాలని తెలిపారు. షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులు 15న లేదా అంతకుముందు వెబ్ ఆప్షన్ సర్వీస్ ద్వారా ఎంప్యానెల్డ్ కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యతలను తెలియజేయాలని పేర్కొన్నారు. షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితాను ఏపీసీఎఫ్ఎస్ఎస్ వెబ్ పోర్టల్‌లో చూడవచ్చని తెలిపారు.

15న బద్వేలులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ జిల్లా బద్వేలులోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని వెలుగు కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం కంపెనీలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డానో బీపీఓ అండ్ ఐటీ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో టెలీ కాలింగ్ ఆఫీసర్, ఆల్ డిక్సన్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్, క్వాలిటీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి అర్హతను, అనుభవాన్ని బట్టి రూ. 12–25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు విద్యార్హతలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

అవసరమైనప్పుడు పోలీసులను ఆశ్రయించండి



ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఆయుధాల పనితీరు గురించి వివరిస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి జగదాంబసెంటర్/ అర్బన్ : విద్యార్థులు అవసరమైనపుడు పోలీసులను ఆశ్రయించాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పేర్కొన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 250 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థిని, విద్యార్థులకు గురువారం పోలీసు అధికారులు 'ఓపెన్ హౌస్'కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో పోలీసులు వినియోగిస్తున్న వివిధ రకాల అత్యాధునిక ఆయుధాలు, బాంబ్ డిస్పోజల్ పరికరాల గురించి పోలీసు సిబ్బంది అవగాహన కల్పించారు. మొబైల్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్, మహిళల స్వీయ రక్షణ, శక్తి యాప్ గురించి, డయల్ 100/112 గురించి, 1098 నంబర్ల గురించి అదనపు ఎస్పీ వివరించారు. ఆర్ఐ, అడ్మిన్ విజె రామకృష్ణ, ఆర్ఎస్ఐలు అమరనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రాయచోటి పట్టణం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి: మత సామరస్యానికి ప్రతీకగా రాయచోటి పట్టణం నిలుస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని హిందూ ముస్లింలు ఎప్పటికీ సోదరభావంతో మెలగాలని ఆయన ఆకాంక్షించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌లతో కలిసి హిందూ ముస్లిం సోదరులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. రాయచోటి పట్టణంలో గాంధీబజార్‌లో మార్చి 4వ తేదీ సాయంత్రం జరిగిన పరిణామాల వల్ల జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని అపోహాలు తలెత్తాయన్నారు. చిన్నగొడవ జరిగిందని.. అప్పటి నుంచి పట్టణంలో పోలీస్ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేసి ఎటువంటి ఘర్షణలు జరగకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారన్నారు. ప్రస్తుతం రాయచోటి పట్టణంలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారన్నారు. పట్టణంలో ఉన్న 144 సెక్షన్‌ను తొలగించడం జరిగిందన్నారు.

పశువైద్య విద్యార్థులకు తల్లిదండ్రుల మద్దతు

ప్రొద్దుటూరు రూరల్: స్టైఫండ్ పెంచాలని పశువైద్య విద్యార్థులు చేస్తున్న నిరవధిక దీక్షలకు గురువారం వారి తల్లిదండ్రులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ 39 రోజులుగా తమ పిల్లలు న్యాయమై డిమాండ్ల సాధన కోసం దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులతో సమానంగా పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ ఎందుకు ఇవ్వకూడదని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి సానుకూల ప్రకటన విడుదల చేసి.. తమ పిల్లలకు న్యాయం చేయాలని వారు కోరారు.

మల్లూరమ్మ తిరునాల ప్రారంభం



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లో భక్తులు



ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ తల్లి

చిన్నమండెం: మండల పరిధిలోని మల్లూరు కొత్తపల్లె గ్రామాల్లో వెలసిన శ్రీ మల్లూరమ్మ తల్లి తిరునాల గురువారం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారిని తిమ్మారెడ్డిగారిపల్లె నుంచి మంగళవాయిద్యాలతో ఆలయం వద్దకు పల్లకీలో తీసుకువచ్చారు. గురువారం ఉదయం అమ్మవారికి సిద్దలపూజ జరిపారు. సంతానం లేని వారు అమ్మవారికి వరపడ్డారు.మల్లూరమ్మ తల్లికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. రాయచోటి డీఎస్పీ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో రూరల్ సీఐ వరప్రసాద్ పర్యవేక్షణలో నలుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 250 పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి 22 చాందినీబండ్లు ఏర్పాటు చేశారు. వీటిని ఊరేగింపుగా తీసుకొచ్చారు.



మల్లూరమ్మ తల్లికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చెత్తరహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి టౌన్/ రాయచోటి జగదాంబసెంటర్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి చెత్త రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర,, పీ4 సర్వే, గృహ నిర్మాణ ప్రగతి తదితర అంశాలపై వివిధశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24, 25 తేదీల్లో విజయవాడలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ల సమావేశం జరుగుతుందని, జిల్లాకు సంబంధించిన లక్ష్యాలను 20వ తేదీలోగా పూర్తి చేయాలని తెలిపారు.గృహ నిర్మాణాల్లో ప్రగతి సాధించాలని తెలిపారు. పీ4, వర్క్ ఫ్రం హోం, సర్వేలు, పక్కాగా చేయాలని సూచించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజలనుంచి అందిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రతి మండలంలో కంప్రెసెడ్ బయో గ్యాస్, విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం భూములు గుర్తించి నివేదిక పంపాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

- ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా ఇంటి నిర్మాణంలో పూర్తిగా కాకుండా నిర్మాణదశలో ఉన్న ఇళ్లకు సంబంధించి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థికసాయాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్టీ వర్గానికి చెందిన వారికి రూ.75 వేలు, ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50 వేలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆర్థికసాయం మొత్తాన్ని వివిధ దశల్లో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో దాదాపు 19672 మందికి వంద కోట్ల రూపాయల అదనపు ఆర్థికసాయం అందుతుందని తెలిపారు. హౌసింగ్ శాఖ పీడీ సాంబశివయ్య పాల్గొన్నారు.
- జిల్లా ఆర్థికాభివృద్ధిలో బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతో కీలకమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. గురువారం కలెక్టరేట్ చాంబర్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2024–2025 ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికం డిసెంబర్ 31 నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.10,290 కోట్లకు రూ.13,544 కోట్ల రుణాలు మంజూరు చేసి 131.62 శాతం, ప్రాధాన్యత రంగంలో రూ.8,804 కోట్లకు రూ.10,929 కోట్లు మంజూరు చేసి 124.31 శాతం, వ్యవసాయ రంగంలో రూ. 7,573 కోట్లకు రూ. 9,741 కోట్లు మంజూరు చేసి 132 శాతం ఆర్థిక ప్రగతి సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జి. ఆంజనేయులు, ఏఎల్‌డీఎం వన్నూర్‌బాషా. ఎస్బీఐ నాబార్డు ఏజీఎం విజయ్ విహారి. ఆర్బీఐ ఎల్డీఎం రోహిత్ అగర్వాల్ పాల్గొన్నారు.

కూటమి కక్ష.. విద్యార్థులకు శిక్ష

- మదనపల్లె కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభం కాకుండా అడ్డంకులు
- భవనం సిద్ధమైనా మరమ్మతుల పేరుతో జాప్యం
- ఎంపీ మిథున్‌రెడ్డి ప్రతిష్ట పెరుగుతుందని అక్కసు



కేంద్రీయ విద్యాలయం కోసం సిద్ధమైన భవనాలు

బి.కొత్తకోట: మదనపల్లె ప్రాంత విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలన్న సదుద్దేశంతో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పదేళ్ల కేంద్రంతో పోరాడి సాధించిన ప్రతిష్టాత్మక కేంద్రీయ విద్యాలయం తరగతులు ఈ ఏడాది ప్రారంభం కాకుండా ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోంది. విద్యార్థులతో కూటమి ప్రభుత్వం చెలగాటం అడేందుకు సిద్ధమైపోయింది. పలు కేంద్రీయ విద్యాలయాల్లో విద్యార్థుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలవ్వగా మదనపల్లె కేంద్రీయ విద్యాలయం విషయంలో మాత్రం కక్ష కట్టారు. అత్యంత ప్రతిష్టాత్మక విద్యాలయం ఏర్పాటు చేయడంపై సహకరించాల్సిన ప్రభుత్వం ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం అడుతోంది. సీబీఎస్ఈ విద్యను అందించే ఈ కేంద్రంలో ఒకటి నుంచి ప్లస్ టూ వరకు విద్యను బోధిస్తారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)లాంటి సంస్థల సహకారంతో విద్యలో ప్రయోగాలు చేపట్టి నూతన ఆవిష్కరణలతో విద్యార్థులను ప్రోత్సహిస్తారు. ఇలాంటి విద్యాలయానికి నోటిఫికేషన్ రాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు సిద్ధం

మదనపల్లెలో 2025–26 విద్యాసంవత్సరంలో కేంద్రీయ విద్యాలయంలో తరగతుల ప్రారంభం కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ ఏడాదే తరగతులు ప్రారంభమయ్యేలా స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ భవనాలను అభివృద్ధి చేయించారు. గదులు, భవన ఆధునీకరణ పనుల కోసం ఎంపీ మిథున్‌రెడ్డి ఎంపీల్యాడ్స్ నుంచి రూ.40 లక్షలు మంజూరు చేసి పనులు చేయించారు. అన్ని వసతులతో భవనం రూపుదిద్దుకొంది. గ్రౌండ్, పైన ఫ్లోర్లు సిద్ధం చేశారు. తరగతులు, కార్యాలయ కార్యకలాపాల నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి.దీంతో మదనపల్లె ప్రాంత విద్యార్థులు విద్యాలయంలో చేరికకు ఆసక్తి చూపుతున్నారు. కాగా శాశ్వత భవనాల నిర్మాణం కోసం పుంగనూరు రహదారిలోని వలసపల్లె వద్ద 6.09 ఎకరాల భూమికి కేటాయించారు. నవోదయ విద్యాలయానికి సమీపంలోనే ఈ కేంద్రీయ విద్యాలయం ఉంటుంది.

మిథున్‌రెడ్డికి పేరు వస్తుందని...



రాజంపేట ఎంపీగా హ్యాట్రిక్ సాధించిన మిథున్ రెడ్డి మదనపల్లెను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెడికల్ కళాశాలను మంజూరు చేయించడమే కాకుండా చారిత్రిక బీటీ కళాశాలను విశ్వవిద్యాలయంగా చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేయించారు. విద్యార్థుల సమస్యలు, విద్యాభివృద్ధికి గత ప్రభుత్వంలో చిత్తశుద్ధితో పనిచేశారు. అలాగే పదేళ్లుగా మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయించి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. కేంద్రీయ విద్యాలయంలో తరగతులు ప్రారంభమైతే మదనపల్లె విద్యా చరిత్రలో కలికితురాయిగా మిగిలిపోతుంది. ఈ ఘనత మిథున్‌రెడ్డికి దక్కుతుందన్న అక్కసుతో ప్రభుత్వం తరగతులను ప్రారంభించేందుకు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించే నోటిఫికేషన్‌కు అడ్డుపడుతున్నట్టు తెలుస్తోంది.

మరమ్మతుల పేరుతో అడ్డంకులు

కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి అంతా సిద్ధమైనప్పటికి చిన్నపాటి మరమ్మతు పనుల పేరిట నోటిఫికేషన్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల కేంద్రీయ విద్యాలయాలకు చెందిన దక్షిణ భారత జోన్ ఇన్‌చార్జి కేవి.సంఘటన్ బృందం వసతులు, ఏర్పాట్లను పరిశీలించి వెళ్లింది. ఈ బృందం వెళ్లి రోజులు గడుస్తున్నా ఇంకా పనుల పేరిట జాప్యం చేస్తుండటం చూస్తుంటే కావాలనే నోటిఫికేషన్ జారీ కాకుండా అడ్డుపడుతున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ ఒకటి నుంచి అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతుంది..ఈలోగా విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే మదనపల్లెకు నోటిఫికేషన్‌పై ఆశలు పెట్టుకున్న విద్యార్థులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం

పేద విద్యార్థులకు విద్యే భవిష్యత్తు, వారికి ఉన్నతమైన విద్యను అందించేందుకు అండగా ఉంటాం. మదనపల్లెను విద్యపరంగా అగ్రగామిగా నిలపాలన్నదే ఆశయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మదనపల్లెలో విద్య కేంద్రాలను మంజూరు చేయించాం. విద్యార్థులకు నష్టం కలగకుండా ఈ ఏడాదే తరగతులు ప్రారంభించాలని కోరుతున్నాం. వైద్యపరంగా పేదలకు మెరుగైన సేవల కోసం మెడికల్ కళాశాలను కూడా మంజూరు చేయించాం. విద్య, వైద్యం అభివృద్ధికి కృషి చేస్తాం.

-పీవీ.మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

క్లుప్తంగా

బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఇద్దరి అరెస్టు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని శ్రీ రంగనాయకస్వామి ఆలయం వద్ద, భాకరాపేటలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం సాయంత్రం మద్యం తాగుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. సిద్దవటంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయం వద్ద శ్రీనివాసులు అనే వ్యక్తిని, భాకరాపేటలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద చంద్రశేఖర్ అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి




కుక్కల దాడిలో మృతి చెందిన జింక

ములకలచెరువు : కుక్కల దాడిలో ఒక కృష్ణ జింక మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. ఫారెస్టు అధికారుల కథనం మేరకు.. మండలంలోని కదిరినాథుని కోట సమీపంలో మేత మేస్తున్న జింకల గుంపుపై కుక్కలు దాడికి యత్నించాయి. ఈ దాడిలో ఒక జింకను కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. స్థానికంగా ఉన్న రైతులు గమనించి కుక్కల నుంచి జింకను కాపాడి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఫారెస్టు అధికారులు చేరుకునే లోపే జింక మృతి చెందింది. అనంతరం వెటర్నరీ డాక్టర్‌తో పోస్టుమార్టం నిర్వహించి కనుగొండలో జింక కళేబరాన్ని ఖననం చేసినట్లు ఫారెస్టు అధికారి గోపాల్ పేర్కొన్నారు.

రంజాన్ నియమాలు.. ముక్తికి మార్గాలు

- ఐదు సూత్రాలు అనుసరించాలంటున్న ఇస్లాం
- ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్ర చేయాలని సూచన
- అల్లాహ్ మార్గంలో నడవాలంటున్న పెద్దలు



రాజంపేట టౌన్ : పవిత్ర రంజాన్ మాసం ఆరంభమైంది. అందువల్ల అనేక మంది ఉపవాసాలు ఉంటూ అల్లాహ్ స్మరణలో ఉంటున్నారు. అయితే కొంతమంది తమ విధుల నిర్వహణ వల్ల రంజాన్ మాసంలో చేపట్టే పవిత్ర కార్యక్రమాలు చేపట్ట లేక పోతున్నారు. ఇంకొంత మంది పెద్దల మాట పెడచెవిన పెట్టి ఈ పవిత్ర మాసంలో చేపట్టాల్సిన పుణ్య కార్యాలను చేయడం లేదు. అయితే పవిత్ర రంజాన్ మాసంలో కనీసం కొన్ని రోజులైనా ఉపవాసాలు ఉంటూ అల్లాహ్ స్మరణలో ఉండాలని ముస్లీం మతపెద్దలు చెబుతున్నారు. అప్పుడే మనిషి మంచి మార్గంలో పయనించి ఇతరుల పట్ల ప్రేమ, దయ కలిగి వుండటంతో పాటు పేదల ఆకలి బాధలు కూడా తెలుసుకోగలరని, తద్వారా ఆకలితో బాధపడే పేదల ఆకలి తీర్చగల గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దబడతారని వారు చెబుతున్నారు.

సర్వమానవాళి శాంతిమార్గంలో నడవాలని ఇస్లాం సూచిస్తుంది. ప్రతి ఒక్కరు చెడుకు దూరంగా, సన్మార్గంలో నడవాలని బోధిస్తుంది. అల్లాహ్ ప్రసాదించిన పవిత్ర గ్రంథం దివ్యఖురాన్. ఈ గ్రంథం అవతరించింది రంజాన్ మాసంలోనే. ఈ మాసంలో ముస్లీంలు భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మికంగా గడిపేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. తమ జీవితంలో పాటించాల్సిన పంచ నియమాలను మహమ్మద్ ప్రవక్త సూచించారు. అవే ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్ర. వీటిలో నమాజ్, రోజా, జకాత్‌ను ప్రతి ముస్లీం రంజాన్ మాసంలో ఎంతో భక్తిశ్రద్ధలతో పాటించాలి. మరోవైపు మంచి విద్య నేర్చుకునేందుకు, ఇతరులకు బోధించేందుకు అల్లాహ్ మార్గంలో నడుచుకోవాలని మతపెద్దలు చెబుతున్నారు.

ఈమాన్..

ఇస్లాం మత మొదటి నియమం ఈమాన్. లాయిలాహ ఇల్లల్లాహ్ మహమ్మదుర్ రసూలల్లా (సొల్లెల్లాహు అలైహి వసల్లం) అని కలిమా తయ్యిబా చదివి ఇస్లాం మతాన్ని స్వీకరించిన ప్రతి ఒక్కరు అందుకు కట్టుబడి ఉండాలి. అల్లాయే భగవంతుడని, ఇతరులకు దైవారాధన చేయరాదని ఈ విషయం చెబుతుంది. ప్రవక్త మహమ్మద్ రసూలుల్లాపై మాత్రమే విశ్వాసాన్ని ఉంచాలి.

నమాజ్..

కలిమా తయ్యిబా చదివి ఈమాన్‌తో ఇస్లాం స్వీకరించిన ప్రతి ముస్లీం రోజుకు ఐదు పూటలా విధిగా నమాజ్ చదవాలి. సూర్యోదయానికి ముందు ఫజర్, మధ్యాహ్నం ఒంటిగంట తరువాత జోహర్, సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో అసర్, సూర్యాస్తమయం తరువాత మగ్‌రిబ్, రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇషా నమాజు చేయాలి.

రోజా..

రోజా అంటే ఉపవాస దీక్ష. మానసిక పరిపక్వత కలిగి, ఆరోగ్యకరంగా ఉన్న ప్రతి ముస్లీం రంజాన్ మాసంలో రోజా పాటించాలి. ఈ మాసంలో ఉండే రోజాలను ఫజర్ రోజా అంటారు. నెలంతా నియమ, నిష్టలతో ఉపవాస దీక్ష ఆచరించాలి. సూర్యోదయం కంటే ముందు నుంచి సూర్యాస్తమయం తరువాత వరకు ఆహారం, నీరు, ఇతర ఎలాంటి తినుబండారాలు, పానీయాలను సైతం తీసుకోకుండా రోజా ఆచరించాలని ఇస్లాం చెబుతుంది. ఏడాదిలో 12 నెలల్లో ఒకనెల అల్లా కోసం ఆయన సూచించిన మార్గంలో నడిచి మిగతా నెలల్లో అదే స్ఫూర్తితో నడుచుకోవాలి.

జకాత్..

ధనవంతులు, దానం చేయగల ఆర్థిక స్థోమత కలిగిన వారందరు విధిగా వస్తు, ధన రూపాల్లో పేదలకు దానం చేయడాన్నే జకాత్ అంటారు. ఒక కుటుంబంలో 7.5 తులాల బంగారం, 52.5 తులాల వెండి ఆభరణాలు, తత్సమానమైన ధనం ఉంటే అందులో 2.5 శాతం విలువగల వాటిని దాన, ధర్మాలు చేయాలి.

హజ్ యాత్ర..

ఆర్థిక స్థోమత కలిగిన ముస్లీంలు విధిగా హజ్ యాత్ర చేయాలి. 40 రోజుల పాటు సౌదీ అరేబియాలోని మక్కా, మదీనా ప్రాంతాలకు వెళ్లి అక్కడ పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయాలి. బక్రీదు పండుగ సమయంలో హజ్ జరుగుతుంది. అప్పు చేసి హజ్ యాత్ర చేయాల్సిన అవసరం లేదు. హజ్ యాత్రకు వెళ్లినప్పటి నుంచి తిరిగి వచ్చే వరకు కుటుంబ పోషణకు అవసరమైన నిధులు ముందుగానే సమకూర్చుకోవాలి.

అల్లాహ్ మార్గంలో నడవాలి..

ఇస్లాం ధర్మాలు, నియమ నిబంధనలు, పాటించాల్సిన సూత్రాలు, ఆచరించాల్సిన పద్ధతులను తెలుసుకోవడం చాలా అవసరం. నేర్చుకున్న అంశాలను ఇతరులకు పంచి అందరు మంచి మార్గంలో నడిచేలా కృషి చేయాలని ఇస్లాం సూచిస్తుంది.

అవకాశాన్ని చేజార్చుకోవద్దు



అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ఏడాదికి ఒక్కమారు వస్తుంది. ఈ మాసంలో ప్రతి ఒక్కరు తమ అనుకూలతను బట్టి విధిగా కొన్ని రోజులైనా రోజా ఉండి అల్లాహ్ స్మరణలో గడపాలి. అప్పుడే మనిషిలో మంచి ఆలోచనలతో సన్మార్గం వైపు పయనించగలడు. అలాగే ధనవంతులు ఈ మాసంలో దాన ధర్మాలు చేస్తే ఎంతో పుణ్యం వస్తుంది. – మౌలానా అబుసయిద్, ఇమామ్, అయేషా మసీదు,రాజంపేట

హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలి

– జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



రాయచోటి : హోలి పండుగను సురక్షితం, సంతోషం, బాధ్యతతో ఆనందంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో పండుగ సందర్భంగా ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలిగించరాదని ఎస్పీ సూచించారు. ఎలాంటి గొడవలకు తావులేకుండా పండుగను జరుపుకోవాలన్నారు. పండుగ పేరుతో హద్దులు దాటితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎవరి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా హోలీ పండుగను కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. హోలీ పండుగ సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని తెలిపారు. చర్మానికి, పర్యావరణానికి హానికరం కాని సహజ రంగులను ఉపయోగించాలన్నారు.

వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు..

సామాజిక మాధ్యమాలలో వదంతులు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అన్నారు. తప్పుడు సమాచారాన్ని పంపినా, షేర్ చేసినా అలాంటి వారిమీద చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు సూచనలు పాటించి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



ధ్వంసం అయిన వైఎస్సార్ విగ్రహం

పీలేరు : స్థానిక జగనన్న కాలనీలోని మూడో వీధిలో ప్రతిష్ఠించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ ఈ చర్యను ఖండించారు. గురువారం ఈమేరకు పీలేరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా ప్రజల మనుషుల్లో నిలిచిన వ్యక్తి వైఎస్సార్ అని కొనియాడారు. అధికారులు స్పందించి వైఎస్సార్ విగ్రహం పునఃప్రతిష్ఠించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయిసంపత్‌కుమార్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఉత్సవం



సద్గురు హజరత్ దర్బార్ అలీషా వలీ, రహమతుల్లా అలై బాబా, జలీల్ మస్తాన్ వలీ బాబా సమాధులు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామ పంచాయతీ సద్గురు సాయి దర్బార్ నగర్‌లో వెలసిన సద్గురు హజరత్ దర్బార్ అలీషా వలీ, రహమతుల్లా అలై బాబా, జలీల్‌మస్తాన్ వలీ బాబా గార్ల గంధం ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మొక్కులు గల భక్తులు జెండాలకు గంధం పూసి ఇంటి వద్ద నుంచి డప్పు వాయిద్యాల నడుమ దర్గా వద్దకు చేరుకొని చెట్ల దగ్గర జెండాలను ఏర్పాటు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గాలో ఉదయం నుంచే భక్తుల సంఖ్య అధికంగా ఉండడంతో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ ఇతర ఏ సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, మండల ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డిలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

కొండకు నిప్పు పెట్టిన ఆకతాయిలు



అడవికి నిప్పు పెట్టడంతో ఎగిసి పడుతున్న మంటలు

సిద్దవటం : మండలంలోని ఫారెస్టు చెక్ పోస్టు సమీపంలో గురువారం సాయంత్రం ఆకతాయిలు కొండకు నిప్పు పెట్టడంతో కొండ తగలబడింది. వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండటంతో చెట్ల ఆకులు రాలిపోయి అటవీ సంపద మంటల ధాటికి తగల బడింది. దీంతో అడవిలో ఉన్న వన్యప్రాణులు, జంతువులు, పక్షులు ఎగిసిపడిన మంటలకు కకావికలమయ్యాయి. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా మంటలు ఎగిసి పడటంతో ప్రయత్నం ఫలించలేదని స్థానికులు తెలిపారు.

రెండు లారీలు ఢీ



శనేశ్వరస్వామి ఆలయ సమీపంలో రోడ్డు కిందకు దూసుకెళ్లిన లారీ

సిద్దవటం : మండలంలోని కడప- చెన్నై ప్రధాన రహదారిలోని మందగిరి శనేశ్వరస్వామి ఆలయం సమీపంలో గురువారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొనడంతో ఒకలారీ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. చెన్నై నుంచి కర్ణాటకకు వెళుతున్న లారీ, ఎర్రగుంట్ల నుంచి రాజంపేట వైపు వెళుతున్న మరో లారీ శనేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఢీకొన్నాయి. కర్ణాటకకు వెళుతున్న డ్రైవర్ నాగరాజు నిద్రమత్తులో ఉన్నందు వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. సంఘటనా స్థలానికి చేరుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ విషయమై ఒంటిమిట్ట సీఐ బాబును వివరణ కోరగా గురువారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు.

భూ వివాదం కారణంగా ఘర్షణ

– ఏడుగురికి గాయాలు

మదనపల్లె : భూవివాదం కారణంగా జరిగిన ఘర్షణలో ఏడుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. మండలంలోని అంగళ్లుకు చెందిన రెడ్డప్ప రెడ్డి స్థానికంగా రైస్ మిల్ నిర్వహిస్తున్నాడు. అతనికి తన భార్య పార్వతమ్మ పేరుపై స్థానికంగా సర్వే నెంబర్ 235, 236లలో కొంత భూమి ఉంది. ఈ భూమిపై తుమ్మచెట్లపల్లెకు చెందిన పులగంటి రెడ్డప్ప, శ్రీనివాసులు , ములకవారిపల్లెకు చెందిన శ్రీనివాస్ రెడ్డి లతో కొంతకాలంగా వివాదం ఉంది. భూవివాదానికి సంబంధించి కోర్టులో రెడ్డప్ప రెడ్డికి అనుకూలంగా తీర్పు రావడంతో, తన భూమి సర్వే చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా గురువారం రెవెన్యూ అధికారులు సర్వేకు వస్తున్న విషయం తెలుసుకున్న మరో వర్గంలోని పులగంటి రెడ్డప్ప, శ్రీనివాసులు, ములకవారిపల్లి శ్రీనివాసులు రెడ్డిలు రైస్ మిల్ యజమాని రెడ్డప్పరెడ్డితో గొడవకు దిగారు. తమ అనుచరులతో వచ్చి కర్రలు సమ్మెట, చురకత్తులతో దాడికి పాల్పడ్డారు. దాడిలో రెడ్డప్ప రెడ్డి (60), ఆయన భార్య పార్వతమ్మ(55), వారి బంధువులు శంకర్ రెడ్డి(46), భార్గవ్ రెడ్డి (28), సాంబశివరెడ్డి (27), చిన్నపరెడ్డి(55), పాలకొండ్రెడ్డి (28) తీవ్రంగా గాయపడ్డారు.ముదివేడు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీరాముని చరిత్ర సరళంగా రాసిన ఘనత మొల్లది

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : సకల గుణాభిరాముడు శ్రీరాముని చరిత్రను సరళంగా రాసిన ఘనత కవయిత్రి మొల్లదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు హాజరై పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కడప జిల్లా గోపవరంలో జన్మించిన ఆతుకూరి మొల్ల 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి అన్నారు. ఆమె రచన శైలి చాలా సరళమైనదని, రమణీయమైనదన్నారు. తాళ్లపాక అన్నమాచార్య సతీమణి తాళ్లపాక తిమ్మక్క తరువాత చెప్పుకోదగ్గ రెండో తెలుగు కవయిత్రి మొల్ల అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, లీగల్ అడ్వైజర్ భద్రయ్య, కలెక్టరేట్ ఏఓ నాగభూషణం, వెనుకబడిన తరగతుల శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు





మాట్లాడుతున్న అపర్ణ, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్న యాజమాన్యం

రాయచోటి అర్బన్ : టెక్నికల్ ఫెస్ట్‌లలో పాల్గొని వివిధ అంశాలపై అవగాహన ల్పించుకోవడం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించవచ్చని కలికిరి జేఎన్‌టీయూ ఎలక్ట్రానిక్ సెమీ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కె.అపర్ణ అన్నారు. గురువారం స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్ సాయినైపుణ్య -2025ను నిర్వహించా రు. సదస్సులో ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన 172 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. వివిధ కళాశాలలు నిర్వహించే వర్క్‌షాపులు, సెమినార్, వెబినార్‌లు, టెక్నికల్ క్విజ్ వంటి అంశాల పోటీలలో పాల్గొనాలన్నారు. తద్వారా ఆత్మన్యూనత భావం తొలగి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. అనంతరం ఈ సింపోజియంలో పాల్గొని ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.కార్యక్రమంలో కళాశాల ఏడీ సుధాకరరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ బాలచంద్ర, ప్రొఫెసర్ వెంకటరమణ, వివిధ కళాశాలల విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులపై దాడి జరిగినా కేసు నమోదు చేయని పోలీసులు



వినతిపత్రాన్ని చూపుతున్న బీఎస్పీ ఇన్‌చార్జి మిద్దెపల్లె బాలాజీ

మదనపల్లె : దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వారిపై పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడంపై బాధితులు బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి మిద్దెపల్లి బాలాజీ ఆధ్వర్యంలో గురువారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను ఆశ్రయించి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మిద్దెపల్లి బాలాజీ మాట్లాడుతూ ఈనెల 9 తేదీన మండలంలోని వలసపల్లె పంచాయతీ బొగ్గిటివారిపల్లెలో గ్రామ కంఠం భూమి విషయమై, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కొందరు దళితులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. దాడిలో వెంకటస్వామి తీవ్ర గాయపడి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఇతనితో పాటు నారాయణ, రజిత, రత్నమ్మ, కృష్ణవేణి తదితరులు గాయపడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై, గురువారం తాలూకా సీఐ కళా వెంకటరమణను సంప్రదించగా, సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఈ విషయమై ఎక్కువ మాట్లాడితే మీపైనే కేసులు పెడతానని తీవ్రంగా హెచ్చరించారన్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్‌ను ఆశ్రయించి దాడి చేసిన వారిపై వెంటనే ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయడంతో పాటు అరెస్ట్ చేసి న్యాయం చేయాలని కోరామన్నారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో బీఎస్పీ నాయకులు ఉదయ్, నరసింహులు, బాధితులు నారాయణ, వెంకటస్వామి, రత్నమ్మ, సురేంద్ర తదితరులు ఉన్నారు.

రైల్వే మంత్రితో మేడా భేటీ

రాజంపేట : కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నతో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి భేటీ అయ్యారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో రైల్వే పరంగా కీలక కేంద్రమైన నందలూరులో పలు రైళ్ల హాల్టింగ్ విషయంపై మంత్రితో చర్చించారు. నందలూరు రైల్వే కేంద్రంలో తిరుపతి, కాచిగూడ మధ్య నడిచే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేయాలని కోరారు. అలాగే పార్లమెంటు నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వే స్టేషన్‌లో ముంబై- చెన్నై మధ్య నడిచే సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేయాలని కోరారు. ఈ రెండు రైళ్ల హాల్టింగ్ విషయంపై మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. ఇప్పటికే రాజ్యసభలో నందలూరు రైల్వే కేంద్రంలో ప్రత్యామ్నాయ రైల్వే పరిశ్రమను, పలు రైళ్లకు నందలూరులో వాటరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి అనువుగా ఉంటుందనే విషయాన్ని ప్రస్తావించారు.

పంచాయతీ నిధులపై విచారణ

వీరబల్లి : మండలంలోని సానిపాయ పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయంటూ స్థానిక నాయకులు కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆర్‌డబ్ల్యుఎస్ క్వాలిటీ కంట్రోల్ అధికారి జాకప్ పాల్, ఏఈ విశ్వనాథ మంచినీటి పనులు, గ్రామాలలో ఏర్పాటు చేసిన నిధులపై గురువారం విచారణ జరిపారు. నిధుల రికార్డులను పరిశీలించారు. ఈ విషయంపై వారు మాట్లాడుతూ నిధులకు సంబంధించి రికార్డులన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత పూర్తి సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నేతి ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అధికార పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

మదనపల్లె : గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయి సీజ్ చేసినట్లు టుటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గురువారం ముందస్తుగా అందిన సమాచారం మేరకు న్యూబైపాస్‌రోడ్డు చంద్రకాలనీ క్రాస్ వద్ద బీకే పల్లి లక్ష్మీనగర్‌కు చెందిన ఆవుల మునిరాజు(34), అతని భార్య ఆవుల సుజాత(28) అక్రమంగా గంజాయి తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించగా గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అంగీకరించారన్నారు. వారి వద్ద నుంచి రూ.80 వేల నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

కేబుల్ వైర్ల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్ఐ తిప్పేస్వామి

నిమ్మనపల్లె : కేబుల్ వైర్ల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 200 మీటర్ల కేబుల్ వైర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలు తెలిపారు. ఇటీవల మండల పరిధిలో నిమ్మనపల్లె, తవళం, అగ్రహారం, సామకోటవారిపల్లె గ్రామాలలో పదుల సంఖ్యలో వ్యవసాయ బోర్ల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్ వైర్లు చోరీ చేశారు. ఘటనపై బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. ప్రత్యేక నిఘా ఉంచి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన ఎస్.చంద్రశేఖర్ (22), మదనపల్లె చంద్రాకాలనీకి చెందిన పి.నాగార్జున(20) కేబుల్ వైర్లను చోరీ చేస్తున్నట్లు నిర్ధారణ అయిందన్నారు. గురువారం నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామన్నారు.